అవిశ్వాసం ఏకగ్రీవం



కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన వైస్‌చైర్మన్, ఇతర సభ్యులు



కాకినాడ ఆర్డీఓ అధ్యక్షత జరిగిన ప్రత్యేక సమావేశం

- సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణకు వ్యతిరేకంగా తీర్మానం
- ప్రత్యేక సమావేశానికి 25 మంది వైఎస్సార్ సీపీ సభ్యుల హాజరు
- ఆమోదించిన ఆర్డీఓ మల్లిబాబు

సామర్లకోట: మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై అవిశ్వాస తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల అసంతృప్తితో 22 మంది సభ్యులు గత నెల 2న కలెక్టరుకు అవిశ్వాసంపై వినతి పత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం అవిశ్వాస తీర్మానంపై బలనిరూపణకు కాకినాడ ఆర్డీఓ ఎస్. మల్లిబాబు ప్రత్యేకాధికారిగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 21 మంది సభ్యులు కోరమ్‌కు హాజరు కావాల్సి ఉండగా 25 మంది వైఎస్సార్ సీపీ సభ్యులు హాజరయ్యారు. ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ సభ్యులు ఈ సమావేశానికి హాజరు కాలేదు. ప్రత్యేక సమావేశానికి ముందుగానే ఆర్డీఓకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్ విప్ జారీ చేసి సింగిల్ అజెండాలో భాగంగా అవిశ్వాసానికి అనుకూలంగా 25 మంది చేతులు ఎత్తి ఆమోదించినట్లు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆ తీర్మానం ఆమోదిస్తున్నట్లు సభ్యుల సంతకాలు సేకరించారు. ఇప్పటికే చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయడంతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. అయితే కలెక్టరు సూచన మేరకు సమావేశం ఉంటుందని ఆర్డీఓ మల్లిబాబు వారికి తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోనికి వెళ్లిన ఇద్దరు సభ్యులు పిల్లాడి సత్యవతి, పితాని కృష్ణలతో పాటు చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసిన గంగిరెడ్డి అరుణ సమావేశానికి హాజరు కాలేదు. విప్ నిబంధనల ప్రకారం పార్టీకి చెందిన సభ్యులు సమావేశానికి హాజరు కాకపోయినా పార్టీకి వ్యతిరేకంగా ఓట్లు వేసిన వారిని పార్టీ నుంచి కౌన్సిల్ సభ్యత్వం నుంచి తొలగించే హక్కు ఉంటుంది. అయితే వీరిపై ఏ విధమైన చర్యలు తీసుకొంటారో వేచి చూడాలి. అనంతరం ఆర్డీఓ మల్లిబాబు విలేకర్లతో మాట్లాడుతూ సమావేశానికి హాజరైన 25 మంది అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చారని తెలిపారు. తీర్మానం అంశం హైకోర్టు పరిధిలో ఉండడం వలన తీర్పు వచ్చే వరకు అధికారిక ప్రకటన చేయడం లేదన్నారు. ఈ సందర్భంగా సీఐ ఎ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రత్యేక సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాల వల్లే

మున్సిపల్ చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చిందని వైస్‌చైర్మన్ ఊబా జాన్ మోజెస్ తెలిపారు. అవిశ్వాస తీర్మానం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దవులూరి దొరబాబు ఎప్పుడు రాజీనామా చేయమంటే అప్పుడు రాజీనామా చేస్తానని చెప్పిన అరుణ టీడీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ సభ్యుల మాటలకు విలువ ఇవ్వలేదన్నారు. కౌన్సిల్ సమావేశాల అంజెండాలో అంశాలు సభ్యులకు చెప్పకపోవడం, జగన్మోహన్ రెడ్డి ఫొటోతో అధికారంలోనికి వచ్చి ఆయనను విమర్శించడంతో పాటు కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, ఆయన తండ్రి సుబ్బారావుపై విమర్శించడాన్ని సభ్యులు జీర్ణించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లి అవిశ్వాసానికి సిద్ధమైనట్లు తెలిపారు. చైర్‌పర్సన్ తీరుపై విచారణ జరిపి ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని మోజెస్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెండో వైస్‌చైర్మన్ గోకిన సునేత్రాదేవి, సీనియర్ కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, సభ్యులు పాల్గొన్నారు.



అవిశ్వాస తీర్మానం అనంతరం మాట్లాడిన ఆర్డీఓ మల్లిబాబు

అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలి

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని సభ్యులు గురువారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ రాజీనామా, ఆమెపై అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందడంతో వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ ఈ మేరకు సూచించారు. చైర్‌పర్సన్ రాజీనామాను ఆమోదించడానికి సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.

క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్

సామర్లకోట: లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ మోర్చా సంయుక్తంగా ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్త సమ్మెకు పిలుపు నిచ్చాయని, ఆ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో దారపురెడ్డి క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయడం ద్వారా నిత్యావసర ధరలు తగ్గించాన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 12 గంటల పని విధానాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు చింతల సత్యనారాయణ, దాడి బేబీ, గూనూరు రమణ, వడ్డి సత్యనారాయణ, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి



వేట్లపాలెంలో సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజప్ప, ఎంపీపీ తదితరులు

సామర్లకోట: నియోజకవర్గంలో పార్టీ రహితంగా జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపు నిచ్చారు. గురువారం మండల పరిధిలో వేట్లపాలెం గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొ న్నారు. ముందుగా సర్ ఆర్థర్ కాటన్ జయంతిని పురస్కరించుకొని గోదావరి కాలువపై ఉన్న విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, పల్లెబాటలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. వాటర్ ట్యాంకు, పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ కె హిమామహేశ్వరి, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు పాల్గొన్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి



రమణక్కపేటలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్సై వెంకటేష్

కొత్తపల్లి: రమణక్కపేట శివారు తోటలో సారా తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై వెంకటేష్ గురువారం సిబ్బందితో సారా బట్టీపై దాడులు చేశారు. సారా తయారీకి ఉపయోగించే సుమారు 100వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న ఎ.శ్రీనును అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారాను తయారు చేయడం, విక్రయించడం నేరమన్నారు. సారా విక్రయాలు జరిగితే సమాచారాన్ని తెలియజేయాలన్నారు. సారా విక్రయాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులకు సహకరించాలన్నారు.

వెయిట్‌లిఫ్టర్‌కు కలెక్టర్ అభినందన



వెయిట్‌లిఫ్టర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఈ నెల 3, 4 తేదీల్లో కేరళలోని ఎర్నాకులంలో జరిగిన జాతీయ స్థాయి పాన్ ఇండియా మాస్టార్స్ వెయిట్ లిఫ్టింగ్ అండ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడ ఏపీఎస్ ఆర్టీసీ డిపోకి చెందిన మండపల్లి శ్రీనివాసరావు నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు గురువారం కలెక్టర్ షణ్మోహన్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావును కలెక్టర్ అభినందించారు. అలాగే వచ్చే జూన్‌లో బెంగుళూరులో 40 దేశాలతో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఆసియా మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు శ్రీనివాసరావు ఎంపిక కావడంతో ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కాకినాడ జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

22న హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయం నుంచి పెద్దాపురం వరకు మోటారు సైకిల్ ర్యాలీ ఉంటుందన్నారు. హిందూ బంధువులందరూ హనుమాన్ జెండాను మోటారు సైకిలుకు ధరించి ర్యాలీలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న పాడా పీడీ

పిఠాపురం: జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి ఏ చైత్ర వర్షిని ప్రారంభించారు. ఈ శిబిరంలో నియోజవర్గ స్థాయి సచివాలయ ఉద్యోగులు, ప్రజలు, పలువురు రాజకీయ ప్రముఖులు, పడా డైరెక్టర్ ఏ చైత్ర వర్షిని సహా 125 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పరిశీలించారు. తలసేమియా వ్యాధి గ్రస్తులు కోసం రక్త దాతలు రక్తదానం చేయడం ఎంతో శుభ పరిణామం అని పలువురికి ప్రాణదాతలుగా రక్తదానం చేసిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైద్య సిబ్బంది మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు, పిఠాపురం తాసిల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో చిన్నారావు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


భారీ వర్షం



కురుస్తున్న వర్షం

కొత్తపల్లి: మండలంలో భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జన జీవనం స్తంభించింది. వర్షానికి ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షం కారణంగా ఊపిరి పీల్చుకున్నారు.

పొల్లు పేరుతో రైతుల దోపిడీ



పొల్లుగా తీసి వేసిన ధాన్యం

సామర్లకోట: ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుకు తీసుకువెళ్లిన ధాన్యాన్ని పొల్లు పేరుతో తమను దోచుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కోతలు ప్రారంభమై నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బస్తాకు 4 నుంచి 10 కేజీలు పొల్లుగా తీసేస్తున్నారని గురువారం రైతులు స్థానిక విలేకర్లకు వివరించారు. ఒకే పంట భూమిలో ఒకే రాశికి చెందిన భూమిలోని ఒక లోడ్‌లో బస్తాకు 4 కేజీలు, మరో లోడ్‌లో 10 కేజీలు పొల్లుగా తీసేస్తున్నారని రైతులు గూడుపు దుర్గారావు, గోలి వెంకట అప్పారావు (మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్) ఆరోపించారు. సామర్లకోట నుంచి జగ్గంపేట బాలాజీ రైస్ మిల్లుకు సుమారు 20 కిలోమీటర్ల దూరం ధాన్యాన్ని తరలిస్తే ఎప్పుడూ లేనివిధంగా చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలుపై జరుగుతున్న అన్యాయంపై సివిల్ సప్లయ్స్ డీఎంకు ఫిర్యాదు చేసినా సరైన స్పందన లేదని ఆరోపించారు. 70 కేజీల బస్తాకు 10 కేజీలు పొల్లుగా తీసేస్తే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. యంత్రాల ద్వారా కోతలు జరుగుతున్న సమయంలో పొల్లు ఏ విధంగా వస్తుందని రైతులు ప్రశిస్తున్నారు. మిల్లర్లతో అధికారులు కుమ్మక్కవుతున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని గోలి దొరబాబు డిమాండ్ చేస్తున్నారు.

ఒకే రాశిలో వేరుగా పొల్లు గుర్తింపు...



కౌలు రైతుగా 15 ఎకరాలు సాగు చేస్తున్నాను. వాతావరణంలో మార్పులకు ధాన్యం ఆర బెట్టడానికి రూ.40 వేలు కూలి అయింది. ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయానికి సిద్ధమైతే జగ్గంపేట మిల్లుకు సీఎంఆర్ ఇచ్చారు. రెండు ట్రాక్టర్లపై ధాన్యం తీసుకువెళితే ఒక ట్రాక్టరులోని బస్తాకు 4 కేజీలు, మరో లోడ్‌లో బస్తాకు 10 కేజీలు పొల్లుగా తీసేస్తున్నారు.

– గూడుపు దుర్గారావు, కౌలు రైతు, సామర్లకోట

రక్తదానం ప్రాణదానం

సామర్లకోట: రక్తదానంతో ప్రాణదాతలుగా గుర్తింపు పొందుతారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు పెద్దాపురం మండలం కాండ్రకోటలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. రెడ్ క్రాస్ సంస్థ ద్వారా రక్తం సేకరణ చేసి అవసరమైన వారికి అందేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ డాక్టరు ప్రసాద్ ఆధ్వర్యంలో దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె హిమామహేశ్వరీ, బీజేపీ నాయకుడు విత్తనాల వెంకటరమణ, మండల స్థాయి అధికారులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలుడికి మలేరియా లక్షణాలు

- ఆస్పత్రికి తరలించిన వైద్య సిబ్బంది
- గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు



గొల్లప్రోలు ఎస్సీ పేటలో వివరాలు సేకరిస్తున్న వైద్య అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలులో 9 ఏళ్ల బాలుడికి మలేరియా లక్షణాలు కనిపించడంతో అప్రమత్తమైన వైద్య సిబ్బంది బాలుడిని ఆస్పత్రికి తరలించారు. బాలుడి ఇంటి పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి అనుమానం ఉన్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. గొల్లప్రోలు ఎస్సీ పేటకు చెందిన తొమ్మిదేళ్ల బాలుడికి మలేరియా లక్షణాలు కనిపించడంతో అర్బన్ పీఎస్‌సీ వైద్యాధికారి డాక్టర్ అమృతరావు ఎస్సీ పేటలో గురువారం ఇంటింటా సర్వే నిర్వహించారు. బాలుడు ఏజెన్సీలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి రావడంతో ఈ లక్షణాలు వచ్చినట్టు గుర్తించారు. పిఠాపురం సీహెచ్‌ఎన్‌సీలో బాలుడిని రిఫర్ చేసి చికిత్స అందిస్తున్నారు. డివిజనల్ మలేరియా అధికారి డానియల్ బాలుడి ఇంటి పరిసరాలను పరిశీలించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పిఠాపురం: వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ గురువారం పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. యూత్ వింగ్ అధ్యక్షుడిగా దాసం వెంకటేష్, మహిళా విభాగానికి జ్యోతుల వాణి, రైతు విభాగానికి గొల్లపల్లి సర్వారాయుడు నియమించారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా పితాని కాశీ విశ్వనాథ్, ఎస్సీసెల్‌కు పెదపాటి రమేష్ కుమార్, ఎస్టీ సెల్‌కు సింగం నాగేశ్వరరావు, మైనార్టీ సెల్‌కు సయ్యద్ మొహిద్దీన్, క్రిష్టియన్ మైనారిటీ సెల్‌కు సందక శ్యామలరావు, స్టూడెంట్ వింగ్‌కు నల్లమిల్లి పవన్ కుమార్, పంచాయతీ రాజ్ వింగ్‌కు కర్నీడి సత్యనారాయణను నియమించారు. మున్సిపల్ వింగ్‌కు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, ఆర్టీఐ వింగ్‌కు పచ్చిమళ్ల అప్పలరాజు, వలంటీర్స్ వింగ్‌కు గుల్లపల్లి గణేష్, గ్రీవెన్స్ సెల్‌కు నేతల సురేష్ కుమార్, వాణిజ్య విభాగంకు వర్ధినీడి శ్రీనివాస్, వీవర్స్ వింగ్‌కు గోపి హరిబాబు, వైఎస్సార్ టీయూసీకు గింజాల రామకృష్ణ, అంగన్‌వాడీ వింగ్‌కు నరకుర్తి వెంకటలక్ష్మి, లీగల్ సెల్‌కు నల్లా రాజశేఖర్, కల్చరల్ వింగ్‌కు వేణుం నారాయణరావు, సోషల్ మీడియా వింగ్‌కు బోడపాటి రాజేష్, ఐటీ వింగ్‌కు కందా దీప్తి, డాక్టర్స్ వింగ్‌కు రంది కృష్ణ, ఇంటిలెక్చువల్ ఫోరం వింగ్‌కు వడిశెట్టి సత్యనారాయణ రెడ్డి, బూత్ కమిటీ వింగ్‌కు కొత్తెం పశువులరావు, పబ్లిసిటీ వింగ్‌కు గ్రంధి గణేష్‌లను నియమిస్తు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు వచ్చాయి.

టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వలసపాకల క్రికెట్ కార్నివాల్ సీజన్–4 పోటీలను మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ప్రారంభించారు. వలసపాకల గ్రామానికి చెందిన 5 జట్లు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కాలేటి సునీల్‌కుమార్, మేడిశెట్టి సత్యనారాయణ, జాన్, ముడుగు జశ్వంత్, ఉండ్రాజపు కౌశిక్ తెలిపారు. 31 తేదీన ఫైనల్ పోటీ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కొత్తపల్లి–జీజీహెచ్ సర్వీస్ పునరుద్ధరణ

జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు

కాకినాడ సిటీ: కలెక్టర్ ఆదేశాలతో యు.కొత్తపల్లి–కాకినాడ జీజీహెచ్ మధ్య ఆర్టీసీ బస్ సర్వీసును అధికారులు పునరుద్ధరించారు. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో యు.కొత్తపల్లి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వరకూ నేమాం, వాకలపూడి మీదుగా బీచ్ రోడ్డులో నడిపిన ఆర్టీసీ బస్సు సర్వీసు విద్యార్థులకు, మహిళలకు, ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేదని, ఐదేళ్ల నుంచి ఈ సర్వీసును నిలిపివేయడం వల్ల ఇబ్బంది పడుతున్నామని, బస్సును పునరుద్ధరించాలని యు.కొత్తపల్లి ప్రజలు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కోరారన్నారు. దీంతో కలెక్టర్ షణ్మోహన్ బస్సును పునరుద్ధరించాలని ఆదేశించారన్నారు. ప్రజలకు అనువైన సమయంలో రెండు ట్రిప్పులు నడుపుతున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం 6.30 గంటలకు కాకినాడలో బయలుదేరి 7.30 గంటలకు కొత్తపల్లి వెళ్లి అక్కడ నుంచి ఉదయం 7.50 గంటలకు బయలుదేరి ఉప్పాడ, సుబ్బంపేట, నేమాం, సూర్యారావుపేట లైట్‌హౌస్, వాకలపూడి, వలసపాకల, సర్పవరం జంక్షన్ మీదుగా 9.05 గంటలకు జీజీహెచ్ చేరుకుంటుందని రవాణా అధికారి శ్రీనివాసరావు తెలిపారు. తిరిగి సాయంత్రం 4.40 గంటలకు జీజీహెచ్ వద్ద బయలుదేరి 5.55 యు.కొత్తపల్లి వెళ్తుందన్నారు. తిరిగి కొత్తపల్లిలో 6.10 గంటలకు బయలుదేరి రాత్రి 7.10 గంటలకు కాకినాడ వస్తుందని తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- నిందితుడికి ఏడాది జైలు
- రూ.వెయ్యి జరిమానా

కరప: ఉద్యోగం ఇప్పిస్తానని మోసంచేసిన నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ జేఎఫ్‌సీఎం ఫర్ పీఅండ్‌ఈ కోర్టు మెజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి తీర్పు చెప్పారు.

దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలం పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన బిరుదా వెంకటరమణ కుమారుడికి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని, నెలకి రూ.50 వేలు జీతం వస్తుందని నమ్మించి వెంకటరమణ వద్ద నుంచి విశాఖపట్టణానికి చెందిన పూరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.10 లక్షలు తీసుకుని మోసం చేశాడు. వెంకటరమణ తాను ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వాలని శ్రీనివాసరెడ్డిని అడగగా డబ్బు తిరిగి ఇవ్వకపోగా, చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2015 డిసెంబరు పదో తేదీన అప్పటి ఎస్ఐ కేసు నమోదుచేసి, కాకినాడ కోర్టులో శ్రీనివాసరెడ్డిపై చార్జిషీట్ ఫైల్ చేశారు. ఫిర్యాది వెంకటరమణ తరపున కాకినాడ స్పెషల్ జేఎఫ్‌సీఎం ఫర్ పీఅండ్ ఈ కోర్టు ఏపీపీ ఎస్.నాగరాధిక కేసు వాదించారు. పూర్వాపరాల పరిశీలన అనంతరం మెజిస్ట్రేట్ పై విధంగా తీర్పు చెప్పారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ పర్యవేక్షణలో కరప ఎస్ఐ టి.సునీత, కోర్టు కానిస్టేబుల్ కె.రాజేష్ ఈ కేసుకు సంబంధించిన సాక్షులను, సాక్ష్యాలను ప్రవేశపెట్టి, ముద్దాయికి శిక్ష పడడంలో కృషి చేశారు.

విరబూసిన మే పుష్పాలు



కొత్తపల్లి: సాధారణంగా పుష్పాలు కాలాలకు అనుగుణంగా పూస్తుంటాయి. అయితే ఈ పుష్పాలు మాత్రం ఒక మే నెలలో మాత్రమే పూస్తాయి. స్థానిక కాకరపల్లి గంగధర్‌రావు స్వగృహం వద్ద గురువారం మే పుష్పాలు విరబూశాయి. ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న మొక్క నుంచి ఒక్కసారిగా మే పుష్పం విరబూయడంతో వాటిని చూసేందుకు చుట్టు పక్కల వారు ఆసక్తి కనబరిచారు.

గ్యాస్ కంపెనీలు నిబంధనలు పాటించాలి

బోట్‌క్లబ్: గ్యాస్ కంపెనీ డీలర్లు తూనికలు, కొలతల శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆశాఖ డిప్యూటీ కంట్రోలర్ జనార్దనరావు అన్నారు. లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా గురువారం కాకినాడలోని గ్యాస్ కంపెనీ డీలర్లు, సిబ్బంది, డెలివరీ బాయ్స్, వినియోగదారులకు అవగాహన కలిప్పించారు. డెలివరీ బాయ్స్ స్ప్రింగ్ బ్యాలెన్స్ తూనిక యంత్రాన్ని తీసుకువెళ్లి ప్రతి వినియోగదారునికి గ్యాస్ సిలిండర్ తూకం వేసి చూపించాలన్నారు. నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ ధరకు సిలెండర్ డెలివరీ చేయకూడదన్నారు. డీలర్లు కూడా గ్యాస్ గొడౌన్‌లో సిలిండర్లు సంబంధిత డీలర్ వేయింగ్ మిషన్ ఏర్పాటు చేసి సిలిండర్ తూకం ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కమర్షియల్ సిలిండర్ మీద లీగల్ మెట్రాలజీ ప్యాకేజీ నిబంధనలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సలీం పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల నిర్వహణ భేష్

- దేవదాయశాఖ డీసీ రమేష్‌బాబు
- భావనారాయణస్వామి ఆలయ ఈఓ మాచిరాజుకు సత్కారం

బోట్‌క్లబ్: సర్పవరం దేవస్థానం ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణను గురువారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు సత్కరించారు. ఈ నెల ఆరో తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలను విజయవంతగా నిర్వహించడం, చరిత్రలో మొదటిసారిగా తెప్పోత్సవాన్ని ఎటువంటి ఇబ్బందీ లేకుండా నిర్వహించడంతో ఆయనను ఈ మేరకు సత్కరించారు. స్వామివారి వార్షిక కల్యాణాలకు ఏదో వివాదం జరిగేదని, ఈసారి అలాంటివి లేకుండా వందలాది భక్తుల సమక్షంలో గ్రామస్తులు, దాతలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం తీసుకుని విజయవంతం చేశారని రమేష్ బాబు ఆయనను ప్రశంసించి జ్ఞాపిక అందజేశారు. పూర్తిగా గ్రామస్తులు, భక్తులు, సహకరించారని అన్ని వర్గాల సహాయ సహకారాలు ఉన్నాయని అందుకే ఈ కార్యక్రమాలు తన వంతు బాధ్యతగా సక్రమంగా నిర్వహించానని లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా దేవాదాయశాఖాధికారి సుబ్బారావు, డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్లు ఫణికుమార్, సోమరాజు పాల్గొన్నారు.



భావనారాయణస్వామి దేవస్థానం ఈఓను సత్కరిస్తున్న దేవదాయశాఖ డీసీ రమేష్‌బాబు